## క్లుప్తంగా

### నేడు వై ఏపీ నీడ్స్ జగన్

చిత్తూరు కార్పొరేషన్: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం చిత్తూరు నగరం, గుడిపాలలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు దొడ్డిపల్లెలో, సాయంత్రం 4.30 గంటలకు కట్టమంచిలో, 5 గంటలకు చామంతిపురంలో, 5.30 గుడిపాల మండలంలోని మరకాలకుప్పంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### ఎస్ఐకి దళిత నాయకుల సత్కారం


ఎస్ఐని సత్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

యాదమరి: నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మునస్వామిని మండలంలోని దళిత సంఘాల నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. గత వారంలో బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐని మండలంలోని దళిత సంఘాల నాయకులు సాయంత్రం పోలీసు స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువ కప్పి సత్కరించారు. దీనిపై ఎస్ఐ వారితో మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా వచ్చి విన్నవించాలన్నారు.

### ఉచితంగా 750 మందికి కంటి పరీక్షలు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం వరదరాజులపల్లిలో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారంతో ముగిసింది. శంకర నేత్రాలయ చెన్నై సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని ఈనెల 19 వతేదీ ప్రారంభించారు. ఇప్పటివరకు 750 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 95 మందికి ఉచితంగా ఆపరేషన్ చేశారు. వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేసి మందులు మాత్రలు పంపిణీ చేశారు.

### మండల సర్వసభ సమావేశం రేపు

బంగారుపాళెం: మండల సర్వసభ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం ఎంపీపీ అమరావతి అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. దీనికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

### బీసీలకు అండగా బీజేపీ

చిత్తూరు కార్పొరేషన్: బీసీల సంక్షేమం కోసం బీజేపీ కృషి చేస్తోందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బీసీల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ బీసీల కోసం ఏమీ చేయలేదన్నారు. పీఎం విశ్వకర్మ యోజన అనే పథకాన్ని దేశవ్యాప్తంగా రూ.13 వేల కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఆడుదాం ఆంధ్రను జయపద్రం చేయండి

చిత్తూరు కార్పొరేషన్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జయపద్రం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం తన నివాసంలో మాట్లాడారు. 15 ఏళ్ల పైబడిన వారందరూ డిసెంబర్ 15లోపు సచివాలయంలో లేదా ఆడుదాం ఆంధ్ర వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని క్రీడల్లో కోరారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని చెప్పారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతలకు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం?

చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద ఎత్తున కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు సమాచారం. కర్ణాటక నుంచి ఓ వాహనంలో మద్యం తరలిస్తుండగా పోలీసులకు అందిన ముందస్తు సమాచారంతో వాహనాన్ని, నిందితులను పట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

### తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోండి

పూతలపట్టు: రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే ఆడుదాం ఆంధ్రా పోటీలకు గ్రామీణ స్థాయిలో ఆడడానికి యువకులు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని ఎంపీడీఓ గౌరి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా పంచాయతీ పరిధిలోని 15 ఏళ్లు నిండిన యువకులు వారి సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న యువకులు మాత్రమే ఆడడానికి అర్హులని తెలిపారు. ఆడుదాం ఆంధ్రాలో క్రికెట్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో డిసెంబర్ 15 నుంచి 20 వరకు, డిసెంబర్ 21 నుంచి మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---

చిత్తూరు నగరంలోని కుళందీశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపారాధన చేస్తున్న భక్తురాలు, ఆలయ ఆవరణలో ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగిస్తున్న భక్తులు






# కోటి కాంతుల కార్తీక దీపం

- ఘనంగా పౌర్ణమి వేడుకలు
- భక్తులకు విరివిగా అన్నదానాలు
- దీపాలు వెలిగించిన భక్తులు

చిత్తూరు రూరల్: దీపం దైవ స్వరూపం అంటారు. శివునికి ప్రీతికరమైన కార్తీక మాసంలో, సాక్షాత్తూ కార్తీక పౌర్ణమి నాడు వెలిగించే దీపాలను తిలకిస్తే ప్రత్యక్షంగా దైవ దర్శనం చేసుకున్నట్టే. చిత్తూరు నగరంలో సోమవారం కూడా కార్తీక పౌర్ణమి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి, ఈశ్వరగుడివీధిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, ఇరువారంలోని నాగేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక పూజలను విశేషంగా చేశారు. మూలస్థానంలోని స్వామి వారికి రుద్రాభిషేకం జరిపించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి సేవలో తరించేందుకు భక్తులు ఉదయం, సాయంత్రం వేళ దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. ఆలయాలు భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి.

**శ్రీకాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో...**

నగరంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీకాళభైరవ ట్రస్టు నిర్వాహకులు జ్వాలతోరణాన్ని నిర్వహించారు. ఉదయం 33 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పౌర్ణమి పూజలు జరిపించారు. రాత్రి జ్వాల తోరణాన్ని కన్నుల పండువగా చేశారు. ట్రస్టు చైర్మన్ వెంకటేష్ భక్తులకు స్వామిప్రసాదం, పసుపు, కుంకుమ అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు, ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బంగారుపాళెం: మండలంలో ప్రసిద్ధిగాంచిన మొగిలి శివాలయంలో సోమవారం కార్తీక శోభ సంతరించుకుంది. తెలుగు కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పరమశివున్ని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయానికి తరలివచ్చారు. ఉదయం శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివాలయం ముందు మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలోని నెల్లి చెట్టుకు ప్రత్యేక పూజలు, ప్రదక్షిణలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

**మాధవనగర్‌లో..**

మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో కేశవానంద స్వామి ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. సమరసత సేవా ఫౌండేషన్, హిందూ ధార్మిక సమ్మేళనం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

**మణికంఠేశ్వర ఆలయంలో..**

ఐరాల: మఠంపల్లె మణికంఠేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వేదాంత్ ఆధ్వర్యంలో శివుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేసి, కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఉసిరి చెట్టు కింద నేతిదీపాలు వెలిగించారు. సాయంత్రం మణికంఠేశ్వర ఆలయంలో ఆలయ ధర్మకర్త చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జ్వాలా తోరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు వెలుగుతున్న జ్వాలా తోరణం కింద పడిన బూడిదను నుదుటిన పెట్టుకున్నారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయంలో మార్మోగాయి.

**కాలభైరవుడి ఆలయంలో..**

తవణంపల్లె: శ్రీ కాలభైరవేశ్వర ఆలయంలో విశేష పూజలు, దీపారాధన చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో కాలభైరవునికి, శివలింగానికి, నందీశ్వరునికి భక్తులు ప్రత్యేకంగా అభిషేకం, పూజలు, అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు నెల్లిచెట్టు, రావి చెట్టు, వేప, బిల్వ చెట్లకు పూజలు చేసి, పిండి దీపాలు వెలిగించి ఆరాధించారు. మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు కార్తీక మాసం సందర్భంగా కార్తీక జ్యోతి వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

**అర్ధగిరి క్షేత్రంలో..**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. తర్వాత ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామికి భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హోమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి దంపతులు, ఆలయ ఈఓ హనుమంతురావు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 8 గంటలకు ఆలయంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం పల్లకిలో కొలువైన వీరాంజనేయస్వామి ప్రాకారంలో తిరుగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.


ఐరాల: విశేష పూజలు అందుకుంటున్న శివయ్య





బంగారుపాళెం: నెల్లిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు, తవణంపల్లె: ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు, అర్ధగిరి క్షేత్రంలో నిర్వహిస్తున్న సుదర్శన హోమం, కాలభైరవుడి ఆలయంలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

## శుద్ధజలం అందించడమే లక్ష్యం

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యమని తవణంపల్లె మండలానికి చెందిన పారిశ్రామికవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైమాఘం సుగుణాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బలిజపల్లెలో మినరల్ వాటర్ యంత్ర పరికరాలను తన సొంత నిధులు రూ.2.50 లక్షల వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సుగుణాకర్‌రెడ్డి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పైమాఘం సుగుణాకర్‌రెడ్డి

### వాటర్ ప్లాంటు ప్రారంభం


మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 50వ డివిజన్‌లో ఉన్న చవటపల్లె వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధినీటి ప్లాంటును ఆర్టీసీ వైస్–చైర్మన్ ఎం సి.విజయానందరెడ్డి సోమవా రం ప్రారంభించారు. తన సొంత నిధుల నుంచి సంతపేట వాసుల కోసం ఈ ప్లాంటును నిర్మించి, అందుబాటులోకి తీసుకొచ్చినట్లు విజయానందరెడ్డి తెలిపారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సహదేవన్, శ్రీకాంత్, మధుబాబు, పార్టీ నాయకులు కెపి.శ్రీధర్, దళవాయి శివకుమార్, శ్రీనివాసన్, చిన్ని పాల్గొన్నారు.

## వరద కాదు మురుగు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 8వ డివిజన్‌లో ఉన్న రీడ్సుపేట–వెంగళరావు కాలనీ మధ్య వరద నీటిని తలపిస్తున్న ఈ ప్రవాహం మురుగునీటి కాలువ నుంచి వస్తోంది. నగరంలో 10 నిముషాల పాటు ఓ మోస్తరు వర్షం పడితే ఇలా మురుగునీటి ప్రవాహం రోడ్డుపైకి వస్తోంది. మునిసిపల్ అధికారులు కాలువల్లో పూడికలు తీయించకపోవడంతో వ్యర్థాలతో నిండిపోయాయి. చిన్నపాటి వర్షం పడిన ప్రతిసారీ మురుగునీళ్లు రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. దుర్గంధంతో ఉన్న నీళ్లంతా ఇళ్లలోకి వచ్చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కాలువలు శుభ్రం చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

ఐరాల: నిరుపేదలకు ఇంటివద్దనే అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

## పాడి రైతులకు అమూల్ చేయూత

తవణంపల్లె: అమూల్ డెయిరీ పాడి రైతులకు చేయూతనిస్తోందని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు భారతి తెలిపారు. ఆమె సోమవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువపై పాడి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు భారతి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాడి రైతుల శ్రేయస్సు కోసం మూల్ డెయిరీతో పాలు సేకరించేందుకు ఏర్పాటు చేశారన్నారు. పాడి రైతులకు అమూల్ డెయిరీ ద్వారా మంచి ధరలు లభిస్తాయని అన్నారు. పాలు ఎలా సేకరించాలి? యంత్రాలతో వెన్నశాతం ఎలా తెలుసుకోవాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ డీసీఓ రవిచంద్రన్, డీడీఓ బ్రహ్మానందరెడ్డి, ఐరాల వెటర్నరీ డీడీ డాక్టర్ పద్మజ, ఏపీఎం రవి, ఏపీఓ లలిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, హాజరైన పాడి రైతులు

## హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

బంగారుపాళెం: హిందూ ధర్మాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ప్రతి హిందువుపై ఉందని జోనల్ ధర్మ ప్రచారకులు మునుస్వామి, విశ్రాంత అధ్యాపకుడు పద్మనాభం అన్నారు. మండలంలోని మాధవనగర్‌లో సోమవారం హిందూ ధార్మిక సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రపంచంలో ఎంతో గొప్ప సంస్కృతి, ఆధ్యాత్మికత, సంప్రదాయాలు కలిగి, సాధన ద్వారా విశ్వశాంతిని కోరుతున్నది సనాతన ధర్మమేనన్నారు. ఈ నేపథ్యంలోనే హిందూ ధార్మిక సమ్మేళనాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం శోభాయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బ్రహ్మానందాశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి, వెంగల్‌రెడ్డి, సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ గురునాథం, కన్వీనర్ రామయ్య పాల్గొన్నారు.

## మొదలియార్లను ఓబీసీలో చేర్చాలని వినతి

చిత్తూరు రూరల్/కలెక్టరేట్: మొదలియార్ కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని, సోమవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని తిరుపతిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర మొదలియార్ సంఘ కార్పొరేషన్ అధ్యక్షులు బుల్లెట్ సురేష్, సంఘ నాయకులు మాట్లాడుతూ, చిత్తూరు గంగినేరు పార్కు వద్ద మరదు సోదరుల విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని, కమ్యూనిటీ భవనం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని విన్నవించారు. ఇదే విషయమై కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు రాజశేఖర్, బాలాజీ, సుందరం, నవీన్, అప్పు, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీని కలిసిన మొదలియార్ సంఘ నాయకులు

# పల్లె ముంగిట కార్పొరేట్ వైద్యం

- జగనన్న సురక్ష పేదలకు వరం
- మండలంలో 8,600 మందికి వైద్య సేవలు


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధుడికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు (ఫైల్)

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రానికి సంక్షేమ వసంతం తీసుకొచ్చారు. ప్రతి గడప వద్దకు పథకాలు అందిస్తూ చరిత్రనే తిరగరాస్తున్నారు. ప్రజలు తన పై పెటుకున్న నమ్మకానికి సీఎం జగన్ ఏ మాత్రం లోటు రానీయకుండా పాలన సాగిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే 99 శాతం నెరవేర్చారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్యం మరింత చేరువ చేశారు. దీంతో దీర్ఘకాలిక రోగులు, అవ్వా తాతలకు ఉచిత వైద్య సేవలందించారు. మారుమూల, శివారు ప్రాంతాల్లో సైతం స్పెషలిస్ట్ వైద్యుల సేవలను అందించింది. ప్రభుత్వం ఈ సురక్ష వైద్య శిబిరాల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ముందుగా వలంటీర్లు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఆయా ప్రజలకు ఏ విభాగానికి చెందిన వైద్య నిపుణులు అవసరమో గుర్తించారు. అందుకు అనుగుణంగా సంబంధిత రంగంలో నిపుణులైన వైద్యులను సురక్ష వైద్య శిబిరాల వద్ద అందుబాటులో ఉంచారు. ఈ శిబిరాల పట్ల ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించి వారు వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు. ఐరాల మండలంలో ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని శిబిరాల ద్వారా 8,600 మందికి వైద్య సేవలు అందించారు. మొత్తం 19 సచివాలయాల పరిధిలో సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అక్టోబర్ 28వ తేదీ వరకు కొనసాగింది. సుమారు నెల రోజుల పాటు నిరాటంకంగా శిబిరాలు నిర్వహించారు. 150 మందికి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు అందించేందుకు గుర్తించారు. అలాగే 2,870 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 100 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని తేల్చారు. శిబిరాల వద్దే 300 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ప్రతి శిబిరంలో ముగ్గురు ప్రత్యేక వైద్య నిపుణులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు ఉన్నారు. విప్లవాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మారుమూల ప్రజలకు వరంలా మారాయి.

### ఉపయోగకరంగా ఉంది



నాకు మోకాళ్ల నొప్పులు, కంటి చూపు తక్కువ. మా ఊరిలో నిర్వహించిన వైద్య శిబిరానికి వెళ్లాను. ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ నాకు పరీక్షలు చేసి మోకాళ్ల నొప్పులకు ఉచితంగా మందులు అందజేశారు. కంటి చూపు తక్కువగా ఉండడంతో డాక్టర్ కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లఅద్దాలను పంపిణీ చేశారు. నాకు సంతోషంగా ఉంది.

– శ్రీనివాసులరెడ్డి, చిన్నవెంకటంపల్లె, ఐరాల

### ఇంటి దగ్గరికే వచ్చి వైద్యం



నాకు 70 ఏళ్లున్నాయి. బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాను. ఇంతకు ముందు చిత్తూరు, తిరుపతి ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోవాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ఇంటి దగ్గరికే డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు కూడా ఉచితంగానే ఇస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదు. చాలా సంతోషంగా ఉంది.

– సులోచనమ్మ, సీ.వీ.పల్లె, ఐరాల

### ప్రజలకు మేలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా శివారు ప్రాంతాలకు సైతం వైద్య సేవలు అందాయి. ప్రతి ఒక్కరినీ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సురక్ష శిబిరం అవ్వా తాతలు, దివ్యాంగులకు ఉపయోగపడింది. మారుమూల గ్రామాల్లో శిబిరాలకు అత్యధికంగా రోగులు వచ్చారు.

– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల